నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 1 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

అట్టహాసంగా రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ

స్టేడియం మైదానంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 30: జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో 69వ రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నీకి ఉమ్మడి పది జిల్లాల నుంచి అండర్-14 విభాగంలోని బాల, బాలికలు 200 మంది పాల్గొన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించనున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి..

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదబాయి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నిరంజన్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ తిలకించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి తర్వాత గెలుపు సాధ్యమేనన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నిరంజన్‌రావు మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ చాటేవారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పేట జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, ఒలింపిక్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురు మూర్తిగౌడ్, నిర్వాహకులు వేణుగోపాల్, బాలరాజు, వడెన్న, స్వప్న, కిష్టన్న పాల్గొన్నారు.

తిరుగుబాటుతోనే 'లగచర్ల' విజయం

- బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, నవంబర్ 30 : ప్రజల తిరుగుబాటు, బీఆర్ఎస్ పోరాటం తోనే లగచర్లలో విజయం సొంతమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని లగచర్ల, రోటిబండతండా, పులిచర్లతండా, దుద్యాల, పోలేపల్లి, హకీంపేటలో 3వేల ఎకరాల్లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా ఆయా గ్రామాల ప్రజలు, గిరిజనుల తిరుగుబాటుతో పాటుబీఆర్ఎస్ పోరాటంతో తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వం ఫార్మా కంపెనీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. రైతుల తరపున కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జైలుకు వెళ్లడంతో రోజురోజుకు ఆందోళన మరింత ఉధృతమవుతున్న నేపథ్యంలోనే ప్రభుత్వం దిగివచ్చి లగచర్లలో భూముల సేకరణను వెనక్కి తగ్గిందన్నారు. ఫార్మా రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని చెబుతుందని, రైతులకు అన్యాయం కాకుండా ప్రజలకు కలుషిత వాతావరణం కలుగకుండా, నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుందంటే ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటును బీఆర్ఎస్ స్వాగతిస్తుందన్నారు. రైతుల తరపున పోరాటం చేసి జైలులో ఉన్న వారందరినీ వెంటనే విడుదల చేయాలని, అమాయక ప్రజలపై పెట్టిన కేసులను కొట్టివేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్రామాల ప్రజలను ఫార్మా పేరుతో ఏడాదిగా నిద్రాహారాలు లేకుండా చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా సొంత నియోజకవర్గ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

గులాబీ సైనికులకు కృతజ్ఞతలు

బీఆర్ఎస్ పేట జిల్లా కార్యాలయంలో శుక్రవారం చేపట్టిన దీక్షా దివస్‌కు 13మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన గులాబీ సైనికులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పెద్ద ఎత్తున నిర్వహించిన బైక్ ర్యాలీకారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడినా ఎంతో ఓర్పుతో సహకరించిన పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

బీఆర్ఎస్ దెబ్బ.. రేవంత్‌రెడ్డి అబ్బ

- లగచర్ల విజయం తెలంగాణ పౌరుషం
- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, నవంబర్ 30 : పదకొండు నెలల కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పేదలు, రైతుల తరపున, విద్యార్థులకు మద్దతుగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాల దెబ్బకు రేవంత్‌రెడ్డి అబ్బా అని తోక ముడుచుకొని ప్రజలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మక్తల్ లో విలేకరులతో మాట్లాడారు. లగచర్లలో బీఆర్ఎస్ చేసిన పోరాటం, రైతుల తరపున కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి జైలుకు వెళ్లడం.. రానురాను రైతుల నుంచి ఒత్తిడి పెరగడం, ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువ కావడంతోనే ప్రభుత్వం దిగి రాక తప్పలేదన్నారు. ఫార్మా పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేసిన రేవంత్‌రెడ్డి ముందుగా ఆరు గ్రామాల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అమాయకంగా కేసులు నమోదు చేసి జైల్లో ఉంచిన పట్నం నరేందర్‌రెడ్డిని అదేవిధంగా లగచర్ల, రోటిబండతండా రైతులను జైలు నుంచి విడుదల చేసి, కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇకముందు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటే బీఆర్ఎస్ తరపున ఎప్పటికప్పుడు పోరాటం చేస్తామని హెచ్చరించారు. నారాయణపేటలో శుక్రవారం చేపట్టిన దీక్షా దివస్ కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గం తరపున పెద్ద ఎత్తున తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

బస్సుల్లేవ..

- అన్ని బస్సులు రైతుపండుగకే..
- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల పడిగాపులు
- బస్టాండ్లల్లో గంటలకొద్దీ నిరీక్షణ
- రేవంత్ సభకు కరువైన ఆదరణ
- పలు ప్రాంతాల్లో ఖాళీగానే బస్సులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఆర్టీసీ బస్సులన్నీ శనివారం మహబూబ్‌నగర్ సమీపంలోని అమిస్తాపూర్‌లో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు పండుగకు వివిధ గ్రామాలనుంచి జనాన్ని తరలించేందుకు బస్సులను కేటాయించారు. చాలా బస్సులు తెల్లవారుజామున బస్టాండ్లల్లోకి రాలేదు. దీంతో ప్రయాణికులకు పడిగాపులు తప్పలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు అదే పరిస్థితి కనిపించింది. బస్సుల్లేక హైదరాబాద్ సిటీ బస్సులను నడిపారు. అయినా ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణ ప్రాంగణాలన్నీ బోసిపోయాయి. కాగా సభకు పలు ప్రాంతాల్లో జనాదరణ కరువైంది. ఒక్కో బస్సులో 15 నుంచి 20 మంది మాత్రమే వెళ్లారు.

బస్సుల్లేక బోసిపోయిన వనపర్తి బస్టాండ్, బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

110 బస్సుల్లో 80 సభకే..

- వనపర్తిలో విద్యార్థులు, ప్రయాణికులకు ఇక్కట్లు
- కిటకిటలాడిన బస్టాండ్లు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించిన వైనం

వనపర్తి టౌన్, నవంబర్ 30: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు పండుగకు వనపర్తి జిల్లా నుంచి రైతులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు కేటాయించారు. అందులో భాగంగా వనపర్తి డిపోలో 110 బస్సులు ఉండగా.. అందులో 80 బస్సులు రైతు పండుగకే తరలించడంతో ఉదయం నుంచి ప్రయాణికులు, ఉద్యోగులు బస్సులు లేక పడిగాపులు కాయాల్సి వచ్చింది. పాఠశాల, కళాశాలలకు విద్యార్థులు కూడా రాలేదు. వనపర్తి జిల్లా కేంద్రానికి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు కార్యాలయాలకు చేరేందుకు ఇబ్బందులు పడ్డారు. వనపర్తి జిల్లా నుంచి వివిధ మండలాలు, గ్రామాలకు బస్సులు రాకపోవడంతో ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్టాండ్‌లో బస్సులు ఉండాల్సిందిపోయి మీటింగ్‌కు వెళ్లడంతో బస్టాండ్ ప్రాంగణం ఖాళీగా దర్శనమిచ్చింది. ఉన్న బస్సుల్లో ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. మరికొందరు ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ఆటోలు, ప్రైవేట్ వాహనాలు దర్శనమిచ్చాయి. వనపర్తి డిపోలో బస్సుల కొనుగోలు చేపట్టకపోవడంతో ఉన్న బస్సులనే అదనపు ట్రిప్పులు తిప్పుతూ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఆ కొన్ని బస్సులను మీటింగ్‌లకు పంపడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురయ్యారు.

వనపర్తి బస్టాండ్ వద్ద ఆటోలు

జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో నిలిచిన వాహనాలు

స్తంభించిన ట్రాఫిక్

- జడ్చర్లలో నిలిచిపోయిన వాహనాలు
- రైతుపండుగకు జనాన్ని తరలించే వెహికిల్స్ రాకతో గంటలకొద్దీ బారులు
- పోలీసులు క్లియర్ చేసినా తగ్గని రద్దీ
- ఇబ్బందులు పడిన వాహనదారులు

జడ్చర్ల, నవంబర్ 30 : జడ్చర్ల మున్సిపాలిటీలో శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్‌జాం చోటుచేసుకున్నది. నిత్యం ట్రాఫిక్ జాంతో ఇబ్బందులు పడుతుండగా.. అమిస్తాపూర్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఉండంతో రాష్ట్రంలోని నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, రైతులు బస్సుల్లో తరలివస్తడంతో జడ్చర్ల పూర్తిగా అష్టదిగ్బంధంలో చిక్కుకున్నది. అన్ని ప్రాంతాలకు జడ్చర్ల మధ్యలో ఉండడంతో ప్రతి వాహనం జడ్చర్ల మీదుగానే మహబూబ్‌నగర్ చేరుకున్నది. దాంతో జడ్చర్లలోని ప్రతి ప్రధాన రహదారిపై గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయాయి. ముఖ్యంగా జడ్చర్ల-కల్వకుర్తి రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడం, రైల్వేబ్రిడ్జి వద్ద సింగిల్‌లైన్ ఉండడంతో వాహనాల రద్దీతో ఒకవైపు పూర్తిగా నిలిచిపోయాయి. వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే జడ్చర్లకు ప్రతినిత్యం పనుల మీదవచ్చే వారు సైతం ట్రాఫిక్‌జాంలో ఇరుక్కుపోయి నానా అవస్థలు పడ్డారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే వాహనాలను కావేరమ్మపేట వద్ద రోడ్డు మళ్లించి ఫ్లై ఓవర్ కిందనుంచి అనుమతించడంతో ఫ్లై ఓవర్ వద్ద పూర్తిగా ట్రాఫిక్ జామైంది. అదీనుగాక సాయంత్రం ఆరు గంటల సమయంలో ఫార్మా కంపెనీల బస్సులు వాటికి తోడవడంతో ట్రాఫిక్‌కు మరింత ఇబ్బందులు నెలకొన్నాయి. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నా.. వాహన రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. జడ్చర్ల ఫ్లై ఓవర్ వద్ద ఎస్సై శివానందం వాహనాలను క్లియర్ చేస్తున్నా ట్రాఫిక్ తగ్గలేదు. దాంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రైతు పండుగకు ఆదరణ కరవు

నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో బస్సుల్లేక నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 30 : ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తున్న రైతు పండుగకు అలంపూర్ నియోజకవర్గంలో రైతుల నుంచి ఆదరణ కరువైయింది. ప్రధానంగా ఉండవల్లి, మానవపాడు మండలాల్లో చాలా వరకు ఆర్టీసీ బస్సులు ఖాళీగా వెళ్లాయి. ఉండవల్లి మండలంలో కొన్ని గ్రామాల్లో బస్సులలో రైతులు, ప్రజలు 15నుంచి 20 మంది మాత్రమే వెళ్లారు. మానవపాడు నుంచి రైతు పండుగ సదస్సుకు వెళ్లే ఒక బస్సులో అధికారులతో కలిపి ఐదుగురు మాత్రమే ఉండి మానవపాడు క్రాస్‌రోడ్డు వద్ద బస్సు వెళ్తుండగా.. నమస్తే తెలంగాణ కెమెరాకు బస్సు, బస్సులో ఉన్న రైతుల ఫొటోలు చిక్కాయి.

మానవపాడు నుంచి రైతు పండుగకు ఆర్టీసీ బస్సులో ఐదుగురు మాత్రమే వెళ్తున్న దృశ్యం

వ్యవసాయం ఎట్లా ఉంది?

- రైతులతో మాట్లాడిన సీఎం రేవంత్
- ఎలక్ట్రిక్ వాహనంపై కూర్చొని స్టాళ్ల పరిశీలన

స్టాల్ వద్ద ఎలక్ట్రిక్ వాహనాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

భూత్పూర్, నవంబర్ 30 : అమిస్తాపూర్ సమీపంలో రైతు పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. శనివారం సాయంత్రం 4:30 గంటలకు హెలీపాడ్ దిగిన వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం స్టాల్స్ యజమానులతో నేరుగా మాట్లాడారు. ఎక్కడి నుండి వచ్చారు? వ్యవసాయం ఏ విధంగా ఉంది.. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నా? అడిగి తెలుకున్నారు. ప్రదర్శన కేంద్రంలో ఎలక్ట్రిక్ వాహనంపై తిరిగారు. కేవలం నిమిషాలపాటు తిరగడంతో పలువురు స్టాల్స్ యజమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బహిరంగ సభా వేదికపైకి సాయంత్రం 5 గంటలకు సీఎం రేవంత్ చేరుకోగా సభను స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతుండగానే జనలేచి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. సభ జరుగుతున్న సమయంలో పోలీసులు, జనాలను భయపెట్టే ప్రయత్నం చేశారు.

జడ్చర్ల మండలం కోడ్గల్ సమీపంలో ఆరుబయట ఉంచిన ధాన్యం కుప్పలు

గింజనూ కొనలే..

- పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- 15 రోజులుగా కొనుగోలు చేయని వైనం
- కల్లాలు, రోడ్లమీదే వరి కుప్పలు
- అధికారుల నిర్లక్ష్యం
- ఆందోళనలో అన్నదాతలు

జడ్చర్ల, నవంబర్ 30 : జడ్చర్ల మండలంలో వరి కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించినా ధాన్యం కొనకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జడ్చర్ల మండలంలోని కోడ్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా.. నేటివరకు గింజకూడా కొనుగోలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నెల రోజుల నుంచి తెలుపుతున్నా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పాలు కావాల్సిన పరిస్థితి దాపురించింది. జడ్చర్ల మండలంలో బాదేపల్లి, పెద్ద ఆదిరాల, పోలేపల్లి, కోడ్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పేరుకే ఏర్పాటు చేశారు కానీ అక్కడ గింజకూడా కొనుగోలు చేయలేదు. కేవలం బాదేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాత్రం పత్తి మార్కెట్‌యార్డులో ప్రారంభించి కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే పెద్ద ఆదిరాల, పోలేపల్లిలో కొనుగోళ్లుఆలస్యం అవుతుండడంతో ఆయా గ్రామాల రైతులు తమతమ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సరైన సమయంలో ప్రారంభించక పోవడంతో బాదేపల్లి పత్తి మార్కెట్‌కు ధాన్యం తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. కోడ్గల్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడంతో రైతులు అక్కడే తమతమ ధాన్యం ఆరబెట్టి తూర్పుపట్టి ఉంచారు. దాదాపు 20రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదీగాక ఫెంగాల్ తూఫాన్‌తో తమిళనాడు, ఏపీలో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుఫాను ప్రభావం ఇక్కడికి వచ్చే పరిస్థితి దాపురించిందని.. అది వస్తే ఆరుబయట ఉన్న ధాన్యం కుప్పల పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోడ్గల్ వద్ద దాదాపు 7వేల నుంచి 10వేల బస్తాలకు సంబంధించిన ధాన్యం కుప్పలు ఉన్నాయి. వర్షాలు వస్తే అవి తడిసిపోయే ప్రమాదం నాన అధికారులు స్పందించి కోడ్గల్‌లో ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. లేదంటే వర్షాలకు నష్టపోవాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 రోజులుగా పడిగాపులు

వరి కోతలై 15రోజులైంది. ధాన్యం కొనుగోలు చేస్తారని ఇక్కడ ఆరబెట్టి ఉంచాం. అధికారులు ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయలేదు. దాదాపు 200బస్తాలకుపైగా ధాన్యం ఉన్నది. అన్నీ నలిగానే ఉన్నా కొనుగోలు చేయకపోవడం శోచనీయం. ఎన్ని రోజులని కాపలా ఉండాలా? అధికారులు స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి.

- రఘుమారెడ్డి, కోడ్గల్, జడ్చర్ల మండలం

ధాన్యానికి కాపలా కాస్తున్నా..

దాదాపు 20రోజుల నుంచి ధాన్యం ఆరబెట్టి ఇక్కడే కాపలా కాస్తున్నాం. ఏ అధికారి కూడా ఇక్కడకు వచ్చిన పాపాన పోలేదు. ప్రభుత్వం మద్దతు ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తుందని.. బోనస్‌కూడా వస్తుందని అమ్ముకుండా ఉన్నందుకు తగిన శాస్తి జరిగింది. ధాన్యానికి కాపలా కాయడమే పనిగా మారింది.

- నారాయణగౌడ్, కోడ్గల్ మండలం జడ్చర్ల

వృథాగా పోతున్న సాగునీరు

కేఎల్ఐ డీ-82 కాల్వకు గండి

వెల్దండ, నవంబర్ 30 : కేఎల్ఐ డీ-82 కాల్వకు మళ్లీ గండి పడింది. శనివారం వెల్దండ మండలం చెర్కూర్ సమీపంలో కాల్వ తెగడంతో సాగునీరు వృథాగా పారుతున్నది. అయితే ఇప్పటికే ఈ వర్షాకాలం ఆరంభం తర్వాత కేఎల్ఐ కాల్వకు 9సార్లు గండి పడింది. అధికారులు నిత్యం కాల్వను పర్యవేక్షించడం మరిచిపోవడంతో కాల్వ తెగిపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే కాల్వ తెగిపోవడంతో సాగునీరు వృథాగా అజిలా పుల్ వైపు పరుగులు పెడుతుండడంతో కాల్వకు దిగువనున్న పంటలు మునిగి నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వకు తరచూ గండ్లు పడకుండా పకడ్బందీగా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.